# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ఎడమ కాలువను సుజల స్రవంతి ప్రాజెక్ట్ తో అనుసంధానం చేసి ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.
- ❖ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగితేనే సమాజ ప్రగతిచక్రం మారుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- ❖ ఎల్-నినో ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున పంట ఎంపిక విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని ప్రభుత్వం రైతులకు విజ్ఞప్తి చేస్తోంది.

=======================

పోలవరం ఎడమ కాలువను సుజల స్రవంతి ప్రాజెక్ట్ తో అనుసంధానం చేసి ఉత్తరాంధ్రలోని సాగు నీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట తాండవ వద్ద రెగ్యులేటర్‌ను ఆన్ చేసి గోదావరి జలాలను ముఖ్యమంత్రి ఉత్తరాంధ్రకు విడుదల చేశారు. అనంతరం ఎడమ కాలువలో ప్రవహిస్తున్న గోదారమ్మకు ఆయన ప్రత్యేక జలహారతి ఇచ్చారు. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ... గోదావరి, కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేస్తామనీ, ప్రతీ ఎకరాకు సాగునీరు ఇస్తామని తెలిపారు. గల గలా గోదావరి... బిర బిరా కృష్ణమ్మ పంక్తులను నిజం చేసి రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తోందని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలను పూర్తి చేశామని, అలాగే పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుకున్నాయి. పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెగ్యులేటర్‌ను ఆన్ చేసి ఈ జలాలను ఉత్తరాంధ్రకు విడుదల చేశారు. అనంతరం ఎడమ కాలువలో ప్రవహిస్తున్న గోదారమ్మకు ఆయన ప్రత్యేక జలహారతి ఇచ్చారు. అంతకుముందు పోలవరం ఎడమ ప్రధాన కాలువ శిలాఫలకాన్ని మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, పి. నారాయణలతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఏలేరు, పంపా, తాండవ నదులను దాటుకుంటూ ఈ కాలువ సాగుతుంది. ఇప్పటివరకు పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం 4 వేల 192 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది. అనకాపల్లి జిల్లాలో లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టుకు, 110 చెరువులకు నీటి సరఫరా కానుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక అవసరాలకూ గోదావరి జలాలు వినియోగించనున్నారు. ఈ కాలువను ఉత్తరాంధ్ర సుజాల స్రవంతితో అనుసంధానం చేసి అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు గోదావరి నీరు అందజేయనున్నారు.

=======================

మహిళలు అందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగితేనే దేశంతో పాటు సమాజ ప్రగతి చక్రం మారుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ & ఆర్కిటెక్చర్ భవనంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ, ఇండియా ఎస్ఎంఈ ఫోరమ్ భాగస్వామ్యంతో ఈరోజు జరిగిన ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్ షాప్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త.. నినాదానికి అనుగుణంగా రాష్ట్రంలోని యువత, మహిళలు, డ్వాక్రా మహిళలు, నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

విరామం

=======================

గ్రామీణ ఖాదీ బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి రుణాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ, గ్రామీణ ఖాదీ బోర్డు అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలోని నేతన్నలకు, హస్త కళాకారులకు గౌరవప్రద జీవనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలగజేయడానికే `నేతన్నల సేవలో` పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

=======================

ఎల్‌నినో ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున పంట ఎంపిక విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. నాయుడుపేటలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి ఎక్స్ పో కిసాన్ మేళా-2026ను ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సాధారణంగా లక్షా 32 వేల హెక్టార్లలో సాగు జరుగుతుండగా కండలేరు నీటి లభ్యత, బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో ఈ ఏడాది సుమారు 52 వేల హెక్టార్లలో సాగు చేపట్టామన్నారు. అయితే ఈ ఏడాది వర్షపాతం 32 శాతం తగ్గిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున

ఖచ్చితమైన నీటి పారుదల సౌకర్యం లేని సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాల రైతులు తొందరపడి వరి సాగు చేపట్టవద్దని కోరారు.

========================

భూముల క్షేత్రస్థాయి సర్వేలో ఎదురయ్యే అవాంతరాలు, లోపాలను అధిగమించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. భూముల క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియపై జిల్లాలోని ఆర్డీవోలు, మండల తహసిల్దార్లు, సర్వేయర్లతో ఆయన ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... భూముల క్షేత్రస్థాయి సర్వే పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలను ఇబ్బంది పెట్టడం, కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. క్షేత్రస్థాయి భూముల సర్వేకు చలానా తప్ప.. ఎవరికి ఎలాంటి రుసుము చెల్లించడం, డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలియజేశారు.

========================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, పేర్లు లేదా చిరునామాల్లో తప్పులు, ఇతర వివరాల్లో మార్పులు అవసరమైతే అర్హులైన ఓటర్లు నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పరిష్కరించే గడువును కూడా అక్టోబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

========================

రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటి రజత పతకం సాధించిన ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీ విద్యార్థినులను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ గిరిధర్ అభినందించారు. గత నెల 27న నిర్వహించిన మహిళల అండర్-23 పోటీలలో శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో ట్రిపుల్ ఐటీకి చెందిన ఆరుగురు విద్యార్థినులు కీలక పాత్ర పోషించి విజయంలో ముఖ్యభూమిక వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారిణులు ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేతుల మీదుగా రన్నరప్ ట్రోఫీతో పాటు.. 50 వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు.

========================
========================